50 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఎస్సై

ఎస్సై రవి, అంబులెన్స్ డ్రైవర్ విక్రమ్

వెల్దండ, జూన్ 26 : రూ.50 వేలు లంచం తీసుకుంటూ నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ ఎస్సై ఏసీబీ అధికారులకు దొరికాడు. ఏసీబీ డీఎస్పీ కృష్ణగౌడ్ కథనం మేరకు.. కల్వకుర్తికి చెందిన వెంకటేశ్ ఈ నెల 17న పేలుడు పదార్థాలతో పోలీసులకు దొరికాడు. వెల్దండ ఎస్సై రవి సదరు వ్యక్తిని కేసు నమోదు చేయొద్దంటే రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. డబ్బులు ఇచ్చేందుకు ఎస్సైకి ఫోన్ చేయగా.. కల్వకుర్తిలో 108 అంబులెన్స్ డ్రైవర్ విక్రమ్‌కు అందించాలని సూచించాడు. మంగళవారం రాత్రి 11 గంటలకు వెంకటేశ్ నుంచి విక్రమ్ రూ.50 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఎస్సై రవిని బుధవారం నాంపల్లి ఏసీబీ కోర్టుకు తీసుకెళ్లినట్టు ఏసీబీ డీఎస్పీ కృష్ణగౌడ్ తెలిపారు.

చిరుతను తప్పించబోయి కారు బోల్తా

భార్య మృతి.. భర్తకు తీవ్రగాయాలు

ఖిలీల్‌వాడి(మోపాల్), జూన్ 26: చిరుతను తప్పించబోయి కారు బోల్తా పడిన ఘటనలో భార్య మృతి చెందగా, భర్తకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన నిజామాబాద్ జిల్లాలో చోటుచేసుకున్నది. కామారెడ్డి జిల్లా యాచారం గ్రామానికి చెందిన మాలోత్ ప్రభాకర్, లలిత (32) దంపతులు. తన భార్యకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో ప్రభాకర్ మంగళవారం సాయంత్రం కారులో నిజామాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానకు బయల్దేరాడు. వైద్య పరీక్షల అనంతరం దంపతులు అర్ధరాత్రి వేళ తిరుగు ప్రయాణమయ్యారు. మోపాల్ మండలం మంచిప్ప –అమ్రాబాద్ అటవీ ప్రాంతంలోకి రాగానే చిరుత కనిపించింది. దాన్ని తప్పించే క్రమంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న పెద్ద బండరాయిని ఢీకొట్టి బోల్తా పడింది. లలిత అక్కడికక్కడే మృతిచెందగా, ప్రభాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న బంధువులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ప్రభాకర్‌ను నిజామాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానకు, లలిత మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రభాకర్ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై గంగాధర్ తెలిపారు.

స్మార్ట్ సిటీ పథకానికి ఇక మూడు రోజులే!

- 30తో ముగియనున్న గడువు
- కేంద్రం పొడిగిస్తేనే ముందుకు

వరంగల్, జూన్ 26 (నమస్తేతెలంగాణ ప్రతినిధి) : చారిత్రక వరంగల్ నగరంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన స్మార్ట్ సిటీ పథకం భవితవ్యం గందరగోళంలో పడింది. ఈనెల 30తో స్మార్ట్ సిటీ పథకం అమలు గడువు ముగియనున్నది. కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీ పనులు, నిధుల మంజూరు గడువును పొడిగిస్తుందా? లేదా అనే దానిపై అనుమానాలు నెలకొన్నాయి. స్మార్ట్‌సిటీ కింద గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.948 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేశారు. ఇప్పటి వరకు వరంగల్ నగరానికి రూ.528 కోట్లు విడుదల చేయగా, రూ.505 కోట్లు ఖర్చు చేసింది. మరో రూ.23 కోట్లు నిల్వ ఉన్నాయి. వారం రోజులక్రితం కేంద్రం రూ.56 కోట్లు విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం వాటాగా మరో రూ.56 కోట్లు విడుదల చేస్తే రూ.112 కోట్లు గ్రేటర్ ఖజానాకు చేరుతాయి. పనులు అసంపూర్తిగా ఉండటంతో స్మార్ట్‌సిటీ పథకం గడువును మరో ఏడాది పొడిగించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. కేంద్రం తీసుకునే నిర్ణయంపైనే వరంగల్ స్మార్ట్‌సిటీ పథకం భవితవ్యం ఆధారపడి ఉన్నది.

రెండుమూడు రోజుల్లో గ్రూప్-1 ఫలితాలు!

హైదరాబాద్, జూన్ 26 (నమస్తే తెలంగాణ): ఈ నెల 9న నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలు రెండు లేదా మూడు రోజుల్లో విడుదల చేయనున్నట్టు తెలిసింది. ఇందుకోసం టీజీపీఎస్సీ అధికారులు కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. మరోవైపు గ్రూప్-1 మెయిన్ పరీక్షకు 1:50కి బదులుగా 1:100 నిష్పత్తి ప్రకారం ఎంపిక చేయాలని ఉద్యోగార్థులు డిమాండ్ చేస్తున్నారు. గ్రూప్-1 ప్రిలిమినరీ ఫలితాల ఎంపిక విధానంపై ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయలేదని, తమకు అన్యాయం జరిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరిస్తున్నారు.

ఏవో ఫలితాలు విడుదల

హైదరాబాద్, జూన్ 26 (నమస్తే తెలంగాణ): అగ్రికల్చర్ ఆఫీసర్ ఫలితాలు బుధవారం టీజీపీఎస్సీ విడుదల చేసింది. 145మంది అభ్యర్థుల జాబితాను టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. 2022లో నోటిఫికేషన్ విడుదల కాగా, 8,961 మంది దరఖాస్తు చేసుకున్నారు. గతేడాది 16న పరీక్షలు నిర్వహించారు.

ఏఈఈ ఎలక్ట్రికల్ ఫలితాలు విడుదల

ఏఈఈ(ఎలక్ట్రికల్) పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ తుది ఫలితాలు విడుదల చేసింది. ఫలితాల కోసం అభ్యర్థులు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించింది.

పచ్చని చెట్లపై కరెంటోళ్ల ప్రతాపం

ఇటీవల కాలంలో హరితహారం చెట్లపై కరెంటోళ్లు కనికరం చూపకుండా అడ్డదిడ్డంగా నరికేస్తున్నారు. విద్యుత్తు తీగలకు కొమ్మలు అడ్డువస్తున్నాయనే కారణంతో ఏకంగా చెట్లనే తొలగిస్తున్నారు. సిద్దిపేట జిల్లా మద్దూరు, ధూళిమిట్ట మండల కేంద్రాల్లో హరితహారం చెట్లను నరికి అపవాదు మూటగట్టుకున్న విద్యుత్తు అధికారులు.. తాజాగా ధూళిమిట్ట మండలంలోని బెక్కల్–తోర్నాల గ్రామాల మధ్య రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన హరితహారం చెట్లను నరికేశారు. కరెంట్ తీగలకు అడ్డువస్తే కొమ్మలను కొట్టాల్సిన అధికారులు ఏకంగా చెట్లను అడ్డంగా నరికేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వాల్టా చట్టం ప్రకారం అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే చెట్లను తొలగించి, వాటి స్థానంలో మొక్కలు నాటాలనే నిబంధనను సైతం అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. –మద్దూరు(ధూళిమిట్ట)

సిటీకి నీటి కటకట

మొదటిపేజీ తరువాయి...

తలెత్తితే జలమండలి చేతులెత్తేయడం ఖాయంగా కనిపిస్తున్నది. ముఖ్యంగా ఇప్పుడు గోదావరి జలాలను తరలించడం అధికారులకు కత్తిమీద సాములా మారింది. హైదరాబాద్‌కు గోదావరి జలాలను తరలించడంలో ఎల్లంపల్లి జలాశయం అత్యంత కీలకమైనది. కానీ, కాంగ్రెస్ సర్కారు ఉద్దేశపూర్వకంగా కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెట్టడంతో ఎల్లంపల్లి జలాశయంలో నీటిమట్టం రోజురోజుకూ అడుగంటిపోతున్నది. దీంతో ఆ జలాశయం నుంచి రోజుకు 17.2 కోట్ల గ్యాలన్లకు గాను 16.3 కోట్ల గ్యాలన్ల నీరు సరఫరా అవుతున్నది. ఇందులో రోజుకు 3 కోట్ల గ్యాలన్ల నీటిని మార్గమధ్యంలో మిషన్ భగీరథకు అందిస్తున్నారు. అంటే హైదరాబాద్‌కు రోజుకు 13.3 కోట్ల గ్యాలన్ల నీరు మాత్రమే సరఫరా అవుతున్నది. ఫలితంగా ప్రస్తుతం 3.9 కోట్ల గ్యాలన్ల కొరత కొనసాగుతున్నది. అన్నారం, సుందిల్ల బరాజ్‌లలోని ఎల్లంపల్లికి ఎత్తిపోయకుండా దిగువకు వదిలివేయడమే ఈ దుస్థితికి కారణం. నిరుడు ఇదే సమయానికి 12 టీఎంసీల నీటినిల్వను కలిగివున్న ఎల్లంపల్లిలో ప్రస్తుతం 3.9 టీఎంసీల నిల్వ మాత్రమే ఉన్నది. ఇందులో నిత్యం ఎన్టీపీసీకి 242 క్యూసెక్కులు, ఆర్ఎఫ్‌సీసీకి 225 క్యూసెక్కులు, మిషన్ భగీరథ కింద మంచిర్యాల,



పెద్దపల్లి, జగిత్యాలకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. దీంతో జలమండలి అధికారులు గత కొన్ని రోజులుగా అత్యవసర మోటార్లతో నీటి సరఫరాను కొనసాగిస్తున్నారు. ఎల్లంపల్లి జలాశయానికి ప్రాణాధారమైన కడెం ప్రాజెక్టుకు కూడా ప్రస్తుతం పెద్దగా వరద రావడం లేదు. ఎగువన వర్షాలు లేకపోవడమే ఇందుకు కారణం. 7.6 టీఎంసీల నిల్వ సామర్థ్యం కలిగిన కడెంలో ప్రస్తుతం 3.9 టీఎంసీల నిల్వ మాత్రమే ఉన్నది. రానున్న 10–15 రోజుల్లో కడెంకు వరద పెరగకపోయినా, ఎల్లంపల్లి పరిసర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురవకపోయినా హైదరాబాద్‌కు తీవ్ర నీటికష్టాలు తప్పవని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

సాగర్‌లో పడిపోయిన నీటి మట్టం

కృష్ణా నది నుంచి హైదరాబాద్‌కు మూడు దశల్లో 90 ఎంజీడీల చొప్పున రోజుకు 270 మిలియన్ గ్యాలన్ల నీటి సరఫరా జరుగుతుంది. ఇది ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు (ఏఎమ్మార్పీ)పై ఆధారపడి ఉన్నది. కానీ, ప్రస్తుతం నాగార్జునసాగర్‌లో నీటిమట్టం 510 అడుగుల కంటే దిగువకు పడిపోవడంతో అత్యవసర మోటార్ల ద్వారా నీటి సరఫరా కొనసాగిస్తున్నారు. పుట్టంగండి వద్ద జలమండలి ఏర్పాటు చేసిన అత్యవసర మోటార్ల ద్వారా ఏఎమ్మార్పీ అప్రోచ్ ఛానల్‌లోకి నీటిని తరలిస్తున్నారు. తద్వారా ప్రాజెక్టులోని రెండు మోటార్ల ద్వారా ఎత్తిపోస్తున్నారు. డిశ్చార్జి ప్రకారం 1,200 క్యూసెక్కులు రావాల్సి ఉండగా.. ప్రస్తుతం అక్కంపల్లి జలాశయానికి లింక్‌కెనాల్ ద్వారా 800 క్యూసెక్కుల నీరు వస్తున్నది. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం కోదండాపూర్ ట్రీట్‌మెంట్ ప్లాంటులోని పంపుహౌజ్‌లో ఎన్ఆర్వీ వాల్వ్ చెడిపోవడంతో రెండో దశ ద్వారా 90 ఎంజీడీల నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో రెండ్రోజులపాటు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జలమండలి ప్రకటించింది.

ప్రపంచానికి పెను సవాల్‌గా డ్రగ్స్

మంత్రులు జూపల్లి, సీతక్క ఆందోళన

హైదరాబాద్, జూన్ 26 (నమస్తేతెలంగాణ): ఉగ్రవాదం తర్వాత డ్రగ్స్ వినియోగం ప్రపంచానికి పెను సవాల్‌గా మారిందని మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క ఆందోళన వ్యక్తంచేశారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దురలవాటు, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం శిల్పకళావేదికలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు శారీరక, మానసిక రుగ్మతలను కలిగించటమేకాక, నైతిక విలువలను దారుణంగా దిగజారుస్తున్నాయని తెలిపారు. విద్యార్థుల వరకు డ్రగ్స్ చేరటం ఆందోళన కలిగిస్తున్నదని వెల్లడించారు. రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీ–నాబ్)ను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డ్రగ్స్ తయారీ,రవాణాను నిరోధించేందుకు కార్యాచరణ అమలు చేస్తామని తెలిపారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గంజాయి జాడ్యం గ్రామాలకు విస్తరించిందని, యువత, విద్యార్థులు ఈ మహమ్మారి బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఉమెన్ మాజీ క్రికెటర్ మిథాలీరాజ్, నటుడు సుమన్, యువ నటుడు తేజ సజ్జ, డీజీపీ రవి గుప్తా, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జితేందర్ పాల్గొన్నారు.

చెంచు ఈశ్వరమ్మ మామ మృతదేహానికి పోస్ట్‌మార్టం

భారీ బందోబస్తు మధ్య నిర్వహణ

నాగయ్య (ఫైల్)

కొల్లాపూర్, జూన్ 26 : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లిలో చెంచులపై నరరూప రాక్షసులు అఘాయిత్యాలకు పాల్పడ్డారు. చెంచు మహిళ ఈశ్వరమ్మపై జరిగిన దాష్టీకంపైనే అంతా దృష్టిసారించారు. కానీ, ఈ గందరగోళంలో ఈ నెల 3న ఇంటి నుంచి రాయరాజుల పెంటకు వెళ్లిన చెంచు ఈశ్వరమ్మ మామ చెంచు నాగయ్య 4వ తేదీన శవంగా కనిపించాడు. అదే రోజు నాగయ్య కుటుంబసభ్యులకు కొంతమంది డబ్బు ఆశ చూపి, ఒత్తిడి చేసి మృతదేహానికి పోస్ట్‌మార్టం చేయించకుండానే అంత్యక్రియలు నిర్వహించారు. ఈ క్రమంలో 'నమస్తే తెలంగాణ' బృందం లోతుగా పరిశీలించి నాగయ్య మృతి విషయాన్ని ఈనెల 24న వెలుగులోకి తీసుకొచ్చి 'ఈశ్వరమ్మ మామను హత్య చేశారా?' అనే కథనాన్ని ప్రచురించింది. దీంతో ప్రజా సంఘాల నాయకులు, బాధిత కుటుంబసభ్యులు పోస్ట్‌మార్టం చేయాలని కోరుతూ సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో భారీ బందోబస్తు మధ్య ఆర్డీవో నాగరాజు, తహసీల్దార్ శ్రీకాంత్, ఎస్సై రుషికేశ్ పర్యవేక్షణలో నాగయ్య మృతదేహానికి వైద్యులు పోస్ట్‌మార్టం చేశారు. పరిసర ప్రాంతాల్లోకి మీడియాను కూడా అనుమతించలేదు. నాగయ్య కాళ్లు, ఛాతిపై గాయాలున్నాయని గుర్తించినట్టు తెలుస్తున్నది. రాష్ట్రంలో సంచలనంగా మారిన నాగయ్య మృతికి సంబంధించిన వివరాలు పోస్ట్‌మార్టం నివేదిక ద్వారా బయటకు వచ్చే అవకాశం ఉన్నది.

ఇసుక అక్రమ రవాణాపై కలెక్టర్ సీరియస్

తరలించకుండా వాగు మార్గాల్లో కందకాలు

ముస్తాబాద్, జూన్ 26: రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలో ఇసుక అక్రమ రవాణాపై కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సీరియస్ అయ్యారు. రెండ్రోజుల కిందట నామాపూర్ శివారులో ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్న కానిస్టేబుల్‌ను హతమార్చేలా ఇసుక స్మగ్లర్లు వ్యవహరించిన తీరుపై.. 'ఇసుక మాఫియా బరితెగింపు' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో బుధవారం కథనం ప్రచురితంకాగా కలెక్టర్ స్పందించారు. ఎగువ మానేరు వాగు పరిసర గ్రామాల నుంచి ఇసుక అక్రమ మార్గాలకు చెక్ పెట్టాలని, కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని తహసీల్దార్ సురేశ్‌కుమార్‌ను ఆదేశించారు. తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ అధికారులు, పోలీసులు రామలక్ష్మణపల్లి, కొండాపూర్ గ్రామాల శివారులోని మానేరు వాగు ఒడ్డు పరిసర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాగు నుంచి ఇసుక తరలించకుండా రహదారులకు అడ్డుకట్ట వేశారు. మార్గాల్లో జేసీబీలతో కందకాలు తీయించి ట్రాక్టర్లు వెళ్లకుండాచేశారు.

డిఫాల్ట్ బెయిల్‌పై నేడు తీర్పు

ఫోన్ ట్యాపింగ్ కేసులో ముగిసిన వాదనలు

నాంపల్లి కోర్టులు, జూన్ 26 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసులో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ అధికారి ప్రణీత్‌రావు, అదనపు డీఎస్పీలు భుజంగ్‌రావు, తిరుపతన్న తరఫున దాఖలైన డిఫాల్ట్ బెయిల్ పిటిషన్ల (తప్పనిసరిగా)పై 14వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో వాదనలు ముగిశాయి. కోర్టు తీర్పును గురువారానికి రిజర్వ్ చేసింది. బెయిల్ పిటిషన్లను దాఖలు చేసిన సమయానికి కోర్టులో చార్జిషీట్ లేదని, 90 రోజులు పూర్తికావడంతో డిఫాల్ట్ బెయిల్ మంజూరు చేయాలని నిందితుల తరఫు న్యాయవాది కోర్టును కోరారు. ఏడు కారణాలతో చార్జిషీట్‌ను తిప్పి పంపించినట్టు మెజిస్ట్రేట్ ఈశ్వరయ్య వెల్లడించారు. భుజంగరావు, తిరుపతన్నకు చెందిన చార్జిషీట్లను కోర్టుకు దాఖలు చేశారని జడ్జి తెలిపారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాంబశివారెడ్డి బదులిస్తూ.. ఒక్కసారి కోర్టుకు చార్జిషీట్ దాఖలు చేస్తే సరిపోతుందని, బెయిల్ పిటిషన్లను దాఖలు చేసినప్పుడు కోర్టులో చార్జిషీట్ లేదనడం సమంజసం కాదని వివరించారు. ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు గురువారానికి తీర్పును రిజర్వు చేసింది.

కోర్టుకు హార్డ్‌డిస్క్‌లు

ఫోన్ ట్యాపింగ్ కేసులో పంజాగుట్ట పోలీసులు సేకరించిన ఎలక్ట్రానిక్ వస్తువులను సాక్ష్యాధారాల కింద కోర్టుకు అందజేశారు. వాటితోపాటు కొన్ని సీడీలు, పెన్‌డ్రైవ్‌లను సాక్ష్యాధారాలుగా పరిగణించాలని కోరారు. ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు జూలైలో వస్తున్నట్టు మెయిల్ ద్వారా తెలియపర్చినట్టు సమాచారం. మీడియా ప్రతినిధి శ్రావణ్‌కుమార్ విదేశాల్లో ఉండటంతో అధికారులు వీరిద్దరికీ వారెంటు తీసుకున్న విషయం తెలిసిందే.

'అదనపు సీట్ల'పై సర్కారు గుస్సా

- జేఎన్టీయూలో 4వేల సీట్లకు ఎన్‌వోసీ జారీ
- ఎందుకు ఇచ్చారన్న కోణంలో ప్రభుత్వం ఆరా!
- ఈ కారణంగానే నిలిచిన ఎప్‌సెట్ కౌన్సెలింగ్

హైదరాబాద్, జూన్ 26 (నమస్తే తెలంగాణ): జేఎన్టీయూ పరిధిలో 4వేలకు పైగా అదనపు సీట్లకు వర్సిటీ అధికారులు ఎన్‌వోసీలు జారీచేయడం వివాదాస్పదమైంది. ఈ అంశంపై సర్కారు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఎందుకు ఇచ్చారన్న కోణంలో ప్రభుత్వం ఆరా తీస్తున్నది. దీని వెనుక పెద్ద దందా నడిచిందన్న ఆరోపణలున్నాయి. ఈ సీట్లకు అనుమతి ఎవరిచ్చారు.. ఎందుకు ఇచ్చారు.. అన్న కోణంలో ఆరా తీస్తున్నారు. దీని ప్రభావం కాలేజీల అఫిలియేషన్లపై పడటంతో సీట్ల సంఖ్య తేలక ఎప్‌సెట్ వెబ్‌కౌన్సెలింగ్ వాయిదా పడింది. గురువారం నుంచి ప్రారంభం కావాల్సిన కౌన్సెలింగ్‌ను జూలై 4కు వాయిదా వేశారు. 2024 –25 విద్యా సంవత్సరంలో ఇంజినీరింగ్ కాలేజీలకు అనుమతులిచ్చేందుకు ఏఐసీటీఈ, జేఎన్టీయూ కాలేజీల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 138 కాలేజీలు దరఖాస్తు చేసుకున్నాయి. పలు కాలేజీలు సీఎస్ఈ కోర్సులో అదనపు సీట్లకు దరఖాస్తు చేసుకోగా, ఏఐసీటీఈ పచ్చజెండా ఊపింది. జేఎన్టీయూ అధికారులు సైతం నిరభ్యంతర పత్రాలు (ఎన్‌వోసీ) జారీ చేశారు. దీనిపై సర్కారు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. తాజాగా గతంలో ఉన్న సీట్లకు ప్రస్తుతం అనుమతినిచ్చి, కౌన్సెలింగ్‌ను కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం.

ఆఫ్ క్యాంపస్‌లకు అనుమతులు లేనట్టే..

ఈ ఏడాది ఆఫ్ క్యాంపస్ కాలేజీకు అనుతివ్వరాదని జేఎన్టీయూ నిర్ణయించింది. అధికారికవర్గాల సమాచారం ప్రకారం బీవీఆర్ఐటీ, వర్ధమాన్ సహా మరో మూడు కాలేజీలు కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ)తో పాటు సీఎస్ఈ అనుబంధ కోర్సులను నిర్వహించేందుకు దరఖాస్తులు సమర్పించాయి. కొన్ని కాలేజీలు సీఎస్ఈ ఏఐఎంఎల్ కోర్సులకు దరఖాస్తు చేసుకున్నాయి. ఆయా కాలేజీలకు ఇప్పుడు అనుమతిని ఇవ్వరాదని జేఎన్టీయూ నిర్ణయించింది. ఒక కాలేజీ వేరే ప్రాంతంలో మరో బ్రాంచిని తెరువడాన్నే ఆఫ్ క్యాంపస్ కాలేజీలంటారు.

ఆరు కాలేజీల్లో ఈవెనింగ్ బీటెక్

తొలిసారిగా ప్రవేశ పరీక్ష ద్వారా సీట్ల భర్తీ

హైదరాబాద్, జూన్ 26 (నమస్తే తెలంగాణ): వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం రూపొందించిన ఈవెనింగ్ బీటెక్‌ను రాష్ట్రంలోని ఆరు కాలేజీల్లో నిర్వహించనున్నారు. ఉస్మానియా ఇంజినీరింగ్ కాలేజీతోపాటు మరో ఐదు కాలేజీల్లో ఈ కోర్సు అందుబాటులోకి వచ్చింది. తొలిసారిగా ప్రవేశ పరీక్ష ద్వారా సీట్లను భర్తీచేయనున్నారు. ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ ఆధ్వర్యంలో జూలై 21న పరీక్ష నిర్వహించనున్నారు. జూలై 11వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. కోర్సుల్లో చేరిన వారికి సాయంత్రం 6 నుంచి రాత్రి 9:30వరకు క్లాసులు నిర్వహిస్తారు. ఆదివారం థియరీ, ప్రాక్టికల్ తరగతులుంటాయి. పూర్తి వివరాలకు https://www.uceou.edu వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ తెలిపారు.

ఈవెనింగ్ బీటెక్ కోర్సు అందుబాటులో ఉన్న కాలేజీలు

- ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ
- చైతన్యభారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ
- మెథడిస్ట్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ
- స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కాలేజీ
- ఎంవీఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజీ
- మాతృశ్రీ ఇంజినీరింగ్ కాలేజీ

5 విడుతల్లో ఎంబీబీఎస్ ఫీజు

- ఒకేసారి వసూలు చేస్తే చర్యలు
- ప్రైవేట్ కాలేజీలకు రెగ్యులేటరీ కమిటీ సూచన

హైదరాబాద్, జూన్ 26 (నమస్తే తెలంగాణ): ప్రైవేట్ కాలేజీల్లో ఎంబీబీఎస్ ఫీజును విద్యార్థుల నుంచి ఐదు విడుతల్లో వసూలు చేయాలని ఫీజు రెగ్యులేటరీ కమిటీ బుధవారం ఆదేశించింది. నాలుగున్నరేండ్ల కోర్సు, 9 సెమిస్టర్లను ఐదేండ్లుగా విభజించినట్టు తెలిపింది. ఫీజు మొత్తం ఒకేసారి వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించింది. ఏటా విద్యాసంవత్సరం ప్రారంభంలో ఒక్కో విడుత ఫీజును వసూలు చేయాలని స్పష్టంచేసింది. ఉదాహరణకు ఒక కాలేజీలో ఏడాదికి రూ.14.5 లక్షలు ఫీజు అనుకుంటే.. నాలుగున్నరేండ్లకు కలిపి రూ.65.25 లక్షలు అవుతుందని పేర్కొన్నది. మొత్తాన్ని 5 విడుతల్లో విభజించి ఒక్కో ఏడాదికి రూ.13.05 లక్షలు మాత్రమే వసూలు చేయాలని స్పష్టం చేసింది.

సమ్మె విరమించిన జూనియర్ డాక్టర్లు

- జూడాల పోరాటానికి బిగొచ్చిన సర్కార్
- నాలుగు రోజుల్లో 610 కోట్లు విడుదల


మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం సమర్పిస్తున్న జూడాలు

హైదరాబాద్, జూన్ 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో జూనియర్ డాక్టర్ల మూడు రోజుల పోరాటానికి ప్రభుత్వం దిగివచ్చి డిమాండ్లను పరిష్కరించింది. దీంతో సమ్మెను విరమిస్తున్నట్టు జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ బుధవారం ప్రకటించింది. హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మీడియా సమావేశం నిర్వహించారు. జూడాలు తనకు ఈ నెల 15న వినతిపత్రం అందించారని చెప్పారు. స్టయిపెండ్‌ను రూ.406 కోట్లు విడుదల చేశామని తెలిపారు. గాంధీ, ఉస్మానియా దవాఖానల్లో హాస్టళ్లు, కాకతీయ మెడికల్ కాలేజీలో రోడ్ల నిర్మాణానికి రూ.204 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేశామని చెప్పారు. జూడాల చైర్మన్ సాయిహర్ష ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, డీఎంఈ వాణి పాల్గొన్నారు.

3 మెడికల్ కాలేజీలకు రూ. 204 కోట్లు

గాంధీ, ఉస్మానియా, కాకతీయ మెడికల్ కాలేజీల్లో వసతుల కల్పనకు వైద్యారోగ్యశాఖ రూ.204.85 కోట్లు కేటాయిస్తూ ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉస్మానియాలో హాస్టళ్లకు రూ.121 కోట్లు, ఆధునీకరణకు రూ.50 లక్షలు, కృష్ణవేణి లేడీస్ హాస్టల్ సీసీ రోడ్లకు రూ.40 లక్షలు, గాంధీలో హాస్టళ్ల నిర్మాణానికి రూ.79.50 కోట్లు కేటాయించారు. కాకతీయ మెడికల్ కాలేజీలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూ.2.75 కోట్లు, ఇతర ఖర్చులకు రూ.70 లక్షలు కేటాయించారు.

వ్యవసాయ బడ్జెట్ 64 వేల కోట్లు!

- వ్యవసాయశాఖ ప్రతిపాదన

హైదరాబాద్, జూన్ 26 (నమస్తే తెలంగాణ): ప్రస్తుత (2024–25) ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ శాఖ బడ్జెట్‌పై జరుపుతున్న కసరత్తు కొలిక్కి వచ్చింది. మొత్తం రూ.64వేల కోట్ల నిధులకు సంబంధించిన ప్రతిపాదనను వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి అందించింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి వ్యవసాయ శాఖ బడ్జెట్ ప్రతిపాదనలపై బుధవారం సమీక్ష నిర్వహించారు. రుణమాఫీ, రైతుభరోసా పథకాలకే 54వేల కోట్లు, పంటల బీమాకు రూ. 3వేల కోట్లు అవసరమవుతాయని పేర్కొన్నారు. రైతుబీమాకు రూ.1500 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణకు రూ.500 కోట్లు ప్రతిపాదించినట్టు తెలిసింది. కేంద్ర బడ్జెట్ తర్వాత ఆగస్టులో పూర్తిస్థాయి రాష్ట్ర బడ్జెట్‌ను రేవంత్ సర్కారు ప్రవేశపెట్టనుంది.

1,575 కిలోల గంజాయి దహనం

డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్‌పర్సన్ చందనాదీప్తి వెల్లడి

భువనగిరి కలెక్టరేట్, జూన్ 26 : రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేసుల్లో పట్టుబడిన 1,575 కిలోల గంజాయిని పోలీసులు దహనం చేశారు. డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్‌పర్సన్ చందనాదీప్తి, అర్బన్ రైల్వే డీఎస్పీ జావిద్ సమక్షంలో యాదాద్రి భువనగిరి జిల్లా తుక్కాపురం పరిధిలోని రోమా ఇండస్ట్రీ మెడికల్ వేస్టేజీ కంపెనీలో దీన్ని తగులబెట్టారు. చందనాదీప్తి మీడియాతో మాట్లాడుతూ.. 2021 నుంచి 2023 వరకు సికింద్